# జడులు

క్రొద్దిరోజుల క్రితం మా పిల్లలకు చదువు చెప్పే జూలియాను, నా స్టడీ రూం లోకి పిలిచాను. "కూర్చో జూలియా!" అన్నాను. "మన అకౌంట్సు సెటిల్ చేసు కుందాం. ఇప్పుడు నీకు అత్యవసరంగా డబ్బు కావలసివచ్చేటట్టు, నీవు నువ్వుగా అడగలేవు. ఇప్పుడు- నెలకు ముప్పయి రూబుళ్ళకు ఒప్పందం జరిగిం ..."

"నలభై."

"కాదు, ముప్పై. నేను నోట్ చేసి పెట్టుకున్నాను. నేను ఎవరికైనా ముప్పై మాత్రమే ఇచ్చేవాణ్ణి. ఇప్పుడు నువ్వు- రెండు నెలలనుంచీ వుంటున్నావు, కాబట్టి..."

"రెండు నెలల అయిదు రోజులు."

"ఖచ్చితంగా రెండు నెలలే. నేను కరెక్ట్‌గా నోట్ చేసి పెట్టుకొన్నాను. అంటే నీకు అరవై రూబుళ్లు రావాలన్న మాట. తొమ్మిది ఆదివారాలు తీసి పారెయ్యి... ఎందుకంటే పిల్లలకు చదువు చెప్పలేదు, వాళ్ళను వాకింగ్‌కి మాత్రమే తీసుకెళ్లావు. మరో మూడు సెలవు రోజులు..."

జూలియా ముఖంలో ఎరుపు వచ్చింది. గౌను కుచ్చెళ్ళు పట్టుకుని - ఒక్క మాటకూడా మాట్లాడలేదు.

"మూడు సెలవు రోజులు. కాబట్టి పన్నెండు రూబుళ్లు తగ్గించాను. నాలుగు రోజులు కోల్యాకి (కొడుకు) జ్వరం కాబట్టి నువ్వు వాన్యానే (కూతురు) కనిపెట్టుకుని వున్నావు. మూడు రోజులు నీకు పంటినెప్పి వచ్చింది. మధ్యాహ్నం తర్వాత పని చెయ్యవద్దని నా భార్య నీకు పర్మిషన్ ఇచ్చింది. పన్నెండు, ఏడు- పంధొమ్మిది తీసెయ్యి .."

జూలియా ఎడంకన్ను చెమ్మగిల్లింది. గెడ్డం అదిరింది. నర్వెస్‌గా దగ్గింది. గట్టిగా వూపిరి పీల్చుకుని - ఒక్క మాటకూడా మాట్లాడలేదు.

"సంవత్సరాదినాడు టీ కప్పు సాసర్లను బద్దలుకొట్టావు- రెండు రూబుళ్లు తీసెయ్యి. కప్పు ఖరీదైనది- ఫరవా లేదులే. తర్వాత- నీ అజాగ్రత్తవల్ల కోల్యా చెట్టు ఎక్కి- తన జాకెట్ చింపు కున్నాడు. తీసెయ్యి పది రూబుళ్లు. మళ్ళీ నీ అలక్ష్యంవల్లే వాన్యా షూస్‌ని పనిపిల్ల యెత్తుకుపోయింది. నువ్వు అన్నీ కని పెట్టుకొని వుండాలి! దానికి ఇస్తున్నాంగా! కాబట్టి, అంటే మరో అయిదు రూబుళ్లు పోతయ్! జనవరి పదో తారీఖు నీకు పది రూబుళ్లు ఇచ్చాను..."

"మీరు ఇవ్వలేదు..." గొణిగింది జూలియా.

"కాని నేను నోట్ చేసుకొన్నానే!"

"సరే... కానియ్యండి."

"ఇరవై యేడు తీసెయ్యి నలభై ఒకటి లోంచి- పధ్నాలుగు మిగులుతాయి."

రెండు కళ్ళు నీళ్ళతో నిండాయి. చిన్ని ముక్కుమీద చిరుచెమట పట్టింది. పాపం జూలియా!

"ఒకే ఒక్కసారి నాకు డబ్బు ఇవ్వటం జరిగింది" తొట్రుపాటు గొంతుతో అంది జూలియా- "అది కూడా మీ భార్యగారు ఇచ్చారు. మూడు రూబుళ్లు, అంతకంటే యెక్కువ కాదు."

"నిజంగా? అయితే ఇప్పుడు చూడు- దాన్ని నేను నోట్ చేసుకోలేదు. కాబట్టి పధ్నాలుగులోంచి మూడు తీసెయ్యి... పదకొండు మిగులుతాయి. ఇదిగో నీ డబ్బు- మూడు, మూడు, మూడు, ఒకటి, ఒకటి ఇదిగో!"

నేను పదకొండు రూబుళ్లు ఆమెకు అందించాను. ఆమె వాటిని అందుకొని, వణుకుతున్న చేతులతో తన జాకెట్‌లో కుక్కుకుంది.

"దయ," గొణుక్కుంది జూలియా.

నేను లేచి నిలబడి, గదిలో అటు ఇటు తిరగసాగాను. నాకు కోపం తారా స్థాయి నందుకొంది.

"దేనికోసం- యీ 'దయ'?" అడిగాను.

"డబ్బుకోసం."

"కాని నీకు తెలుసు నేను మోసం చేశానని. నిన్ను దోచుకున్నాను- నీ నుంచీ నిజంగా దొంగిలించాను. ఎందుకీ 'దయ'?"

"మిగతా ఇళ్ళల్లో వాళ్లు అసలు ఏమీ ఇవ్వలేదు కనుక."

"వాళ్ళు ఏమీ ఇవ్వలేదా? ఆశ్చర్య పడక్కర్లేదు. నీ మీద చిన్న జోక్ చేశాను- ఓ క్రూరమైన పాఠం- నీకు తెలియ చెయ్యటానికి... మొత్తం నీ యెనభై రూబుళ్లు నీకు ఇచ్చేస్తాను. ఇదిగో యీ కవర్‌లో అవి తయారుగా వున్నాయి నీ కోసం... ఇంత వెన్నెముక లేకుండా కూడా వుంటారా? యెందుకు నువ్వు యెదురు తిరగలేదు? యెందుకు మౌనం వహించావు? ఈ ప్రపంచంలో పళ్ళు, దవళ్ళు లేకుండా వుండటం కూడా సాధ్యమా—ఇటువంటి జడులుగా?"

ఆమె వంకరగా నవ్వింది. ఆ నవ్వులో 'అది సాధ్యమే' అన్న భావం చదవ గలిగాను.

ఆమెకు నేర్పబోయిన క్రూరమైన పాఠానికి, నన్ను క్షమించమని అడిగి, ఆమె ఆశ్చర్యపోతూవుంటే, ఎనభై రూబుళ్ళు ఆమెకిచ్చాను. 'దయ' అనే మాటను మెల్లగా, చాలాసార్లు గొణుక్కుంటూ వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన వంకే చూస్తూ యిలా అనుకొన్నాను. 'బలహీనుల్ని ఎంత సులభంగా అణగ్గొట్టచ్చు యీ ప్రపంచంలో.'

—చెఖోవ్